క్లుప్తంగా

ఉత్సవమూర్తులతో ప్రదక్షిణలు



కాళేశ్వరం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణం, ప్రాకారం చుట్టూరా ఉత్సవమూర్తులతో సోమవారం ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

కాటారం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం సోమవారం పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు పాఠశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ఎండ తీవ్రత ప్రభావంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పది మంది లోపు విద్యార్థులు మాత్రమే కనిపించారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమావేశం

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో రేపు (బుధవారం) ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు(మంగళవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులతో పాటు, సర్పంచ్, ఎంపీటీసీలు హాజరు కావాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తారం గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. మంచినీటి బావులకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. రోడ్లు, తాగునీటి సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో నేత్రనందకుమార్, రాంబాబు, కన్నయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

‘గుడ్డు’ గుటుక్కుమనదు!

- ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లపై ముద్ర
- పక్కదారి పట్టకుండా చర్యలు



కాళేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల వయస్సు పిల్లలకు నెలకు 16 చొప్పున, గర్భిణులు, బాలింతలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రోజుకు ఒకటి చొప్పున గుడ్లు ఇస్తారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు నాసిరకంగా ఉంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి. చెడిపోయిన గుడ్లను లబ్ధిదారులకు సరఫరా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జూలై నుంచి కేంద్రాలకు ఇచ్చే గుడ్లపై అంగన్‌వాడీ ముద్ర వేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెల మూడు సార్లు కాంట్రాక్టర్లు కోడిగుడ్లను సరఫరా చేస్తారు. మొదటి విడతలో వచ్చిన గుడ్లపై నీలిరంగు, రెండవ విడతలో ఎరుపు, మూడవ విడతలో ఆకుపచ్చ రంగులతో ‘అంగన్‌వాడీ గుడ్డు’అని ముద్ర వేసి సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం కోడి గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల గడువు జూన్ నెలాఖరుతో పూర్తవుతుంది. ఆ తరువాత నుంచి వచ్చే గుడ్లపై ముద్రలు వేసి పంపిణీ చేయనున్నారు.

పక్కదారి పట్టకుండా...

కొంత మంది బయటికి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పక్కదారి పట్టకుండా కోడిగుడ్లపైన ముద్ర వేయడంతో అంగన్‌వాడీలకు సంబంధించిన గుడ్లు అని గుర్తించచ్చు. ఆరోగ్యలక్ష్మీ పథకం కింద కేంద్రాలు పని చేసే దినాలను బట్టి నెలకు 26 గుడ్లు, 200 మిల్లీ లీటర్ల పాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తారు. సుమారుగా జిల్లాకు 60వేల గుడ్లు సరఫరా అవుతాయి. కాంట్రాక్టర్ ద్వారా కేంద్రాలకు వచ్చిన గుడ్లను అంగన్‌వాడీ టీచర్లు క్షుణ్ణంగా పరిశీలించాలి. గుడ్లపైన ముద్ర లేకపోతే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. గుడ్లు చెడిపోయిన కాంట్రాక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 644 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 589 మెయిన్ సెంటర్లు, 55 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 644 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం గర్భిణులు, బాలింతలు 5,125 మంది, 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 11,040మంది, ప్రిస్కూల్ 3సంవత్సరాల నుంచి 6సంవత్సరాల పిల్లలు 6,231 మంది మొత్తం 22,396 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి కోడిగుడ్లను అందజేయనున్నారు.

త్వరలో పంపిణీ

“త్వరలో కోడిగుడ్లపైన ప్రభుత్వం ముద్ర వేసి పంపిణీ చేయనుంది. దీంతో గుడ్లు లబ్ధిదారులకు అందించడంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఉంటుంది.”

-టి.శైలజ, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ, భూపాలపల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న మహేష్

మల్హర్: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ డీలర్లను హెచ్చరించారు. మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విత్తన, ఎరువు, పురుగుల మందుల నిర్వహణపై ఫర్టిలైజర్ షాప్ డీలర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. విత్తన వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచాలని, కంపెనీ స్టోర్స్ సర్టిఫికేట్ ఉన్న వాటినే రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులు తప్పని సరిగా బాధ్యతగా బిల్లు తీసుకోవడంతో పాటు పంట కాలం అయిపోయే వరకు బిల్లు, విత్తన సంచులు దాచుకోవాలని వెల్లడించారు. విత్తనాల కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెరుచుకోని పాఠశాల



తాళం వేసి ఉన్న పాఠశాల

పలిమెల: మండలంలోని కామన్‌పల్లి ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం రోజున బడి తలుపులు తెరుచుకోలేదని గ్రామస్తులు తెలిపారు. పాఠశాలలతో దాదాపు 15 మంది విద్యార్థులుండా ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఉపాధ్యాయుడు సోమవారం పాఠశాలలకు రాకపోవడంతో మొదటి రోజు పాఠశాల తెరుచుకోలేదు. ఈ విషయంపై సీఆర్‌పీ సాయిని వివరణ కోరగా గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తాను కూడా పాఠశాలలని సందర్శించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడికి కాల్ చేసినప్పటికి ఫోన్ లిఫ్ట్ చేయలేదని ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలి



రంగయ్యపల్లిలో బడిబాట కార్యక్రమంలో డీఈఓ రాంకుమార్

టేకుమట్ల(రేగొండ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని డీఈఓ రాంకుమార్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సోమవారం రేగొండ మండల కేంద్రంతో పాటు రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు నిర్మల, సర్పంచ్ దగ్గు సంధ్యా వెంకన్న, ఉపాధ్యాయులు సతీష్, దేవేందర్‌రెడ్డి, రవి, రవీందర్, ప్రసాద్, లక్ష్మీపతి, శ్రీనివాస్, ఉమాదేవి, రజిని, పీఈటీ రఘు, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు.టేకుమట్ల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రాక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లేనని వైస్‌ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు అన్నారు. మండలంలోని బెస్తగూడెంలో సోమవారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా వారు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరు రక్తదానం చేయొచ్చని అన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఇతరులకు తెలుపాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 21 మంది యువతి, యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ,, ముత్తయ్య, జగదీష్, జయ్, వెన్నల, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్ మృతి తీరని లోటు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జెడ్పీచైర్మన్, బీఆర్‌ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్ మృతి జిల్లా ప్రజలకు, పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ స్థూపం వద్ద సోమవారం జగదీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అభివృద్ధితో పాటు మండల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు సలేందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, వసంతరావు, రఫీక్, జైపాల్‌రెడ్డి, శ్రీరాములు, గంగరాజు, సాంబయ్యలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతి పార్టీకి తీరని లోటు అని కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. కుసుమ జగదీష్ అంతిమయాత్రకు లక్ష్మణ్‌బాబు హాజరైయ్యారు. నాయకులు ప్రదీప్‌రావు, ఖలీల్, ముస్తాఫా, సాగర్ పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్ : మాట్లాడుతున్న సత్యనారాయణరావు



టేకుమట్ల: పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: దశాబ్ది ఉత్సవాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డితో కలిసి గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలుపరచడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. రైతు రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే అన్ని ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని అందుకు ఇటీవల విడుదలైన కర్ణాటక ఫలితాలే నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు ఓరంగంటి శంకర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, రామినేని రవీందర్, అంబాల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, పెరుమాండ్ల రఘు పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్, బూర్నపల్లి గ్రామాలకు చెందిన సురేందర్, కందుల రాజేశ్వరీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, నాయకులు నాంపెల్లి వీరేశం, మాదం కొమురయ్య, శాస్త్రాల కిరణ్, భూపెల్లి రవీందర్, తోడేటి కుమార్, తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న నారాయణరెడ్డి

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గాదరాంపల్లి గ్రామంలో సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రూ.10వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నారాయణరెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండాల్‌రెడ్డి, సమ్మయ్య, పవన్, విజయ్‌కుమార్, రాజు, మోహన్‌సింగ్, సమ్మయ్య, మల్లేష్, సంజీవ్, రాజు, మేకల సమ్మయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

గ్యాస్ గోదాముకు తప్పిన ప్రమాదం



గోదాం ఆవరణలో మంటలు

చిట్యాల: మండల కేంద్రంలోని గ్యాస్ గోదాముకు సోమవారం పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్యాస్ గోదాం సమీపంలోని పంట పొలాల్లో అంటుకున్న మంటలు వ్యాపించి గోదాం ఆవరణంలోకి వచ్చాయి. అక్కడే ఉన్న సివిల్ సప్లై గోదాం హమాలీలు పోలీసులకు సమాచారం అందించడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హమాలీ కార్మికుల సహాయంతో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో మంటలను అదుపు చేశారు. ఫైర్ ఇంజన్ వచ్చే సమయానికే మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఏ కొంచెం ఆలస్యమైనా గ్యాస్ గోదాంలోని గ్యాస్ సిలిండర్‌లకు మంటలు వ్యాపిస్తే సివిల్ సప్లై గోదాం సైతం మంటల్లో చిక్కుకుని పెద్ద ప్రమాదమే సంభవించేదని పలువురు వాపోతున్నారు. మంటలను అదుపు చేసి ప్రమాదాన్ని నివారించిన పోలీస్, హమాలీ కార్మికులను ఈ సందర్భంగా గ్రామస్తులు, పలువురు అభినందించారు.

రాగి లడ్డూల పంపిణీ



రాగి లడ్డూ పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం, పలుగుల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం రాగిలడ్డూలను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలకు అందజేశారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, టీచర్లు రాణి, ఉమా మహేశ్వరి, శైలజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన రాకేష్

మొగుళ్లపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందడంతో పాటు మరొకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల నవాబుపేట గ్రామానికి చెందిన మిర్యాల రాకేష్(18) అనే యువకుడు, చిట్యాల గ్రామానికి చెందిన మరో యువకుడు మొగుళ్లపల్లి నుంచి నవాబుపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి–నవాబుపేట చలివాగు బ్రిడ్జి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి సైడ్ బర్మ్‌లకు బైక్ ఢీ కొట్టడంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడికి గాయాలు అయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలను పట్టించుకోవడం లేదు

- మండల సభలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

కాటారం: మండలంలో సమస్యలు నెలకొన్నప్పటికీ పలు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొంటున్నప్పటికీ పరిష్కార చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలు శాఖల సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య నెలకొంటుందని ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని ట్రాన్స్‌కో సబ్ ఏఈఈని నిలదీశారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తుందని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు అధికారులు, సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని సభలో ఆరోపించారు. మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను సకాలంలో అందజేయకపోవడంతో పాటు నాసిరకం చేప పిల్లలు అందజేయడంతో అవి మత్స్యకారులకు ఉపయోగపడటం లేదని, ఆగస్టు మాసంలో చేప పిల్లల పంపిణీ చేపట్టాలని పేర్కొన్నారు. వీరాపూర్‌లో మత్స్యకార సొసైటీకి అనుమతి ఇవ్వాలని సర్పంచ్ రమేశ్‌రెడ్డి సభలో కోరారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో జరగలేదని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేలా అధికారులు చూడాలని తెలిపారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట చేస్తున్న కార్యక్రమాలతో ప్రజలకు లబ్ధి చేకూరేది ఏమి లేదని కాంగ్రెస్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాలను బహిష్కరిస్తున్నట్లు సభలో వారు నిరసన తెలిపారు. ఓ పక్క గ్రామాల్లో చెరువులు గండ్లు పడి రైతులు నష్టపోతున్నారని అవి పట్టించుకోకుండా ప్రభుత్వం సాగు సంబరాలు చేయడం దేనికి నిదర్శనమన్నారు. గ్రామపంచాయతీల బిల్లులు అందకపోవడంతో సర్పంచ్‌లు అప్పులపాలవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. సంతోషమే లేని చోట సంబురాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వంపై కాంగ్రెస్ సభ్యులు ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల మధ్య స్వల్ప వాగ్వివాదం నెలకొంది. ఎంపీపీ పంతకాని సమ్మయ్య కలుగజేసుకోవడంతో వాగ్వివాదం ముగిసిపోయింది. పలు శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, వైస్ ఎంపీపీ చీర్ల తిరుమల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో దశాబ్ది ఉత్సవాలు



వెంకటాపురం(కె): మండలంలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం గిరిజన దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లి తండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆనందరావు, నాగరాజు, రాజమౌళి, ముత్తయ్య, కుమారస్వామి, రామారావు, రామయ్య, జాన్, రామ్మూర్తి, బుల్లిబాబు తదితరులు ఉన్నారు.